# పుస్తక సమీక్ష

## పటాన్‌చెరు కాలుష్య గాథ




**అభివృద్ధి** అంటే పారిశ్రామికీకరణ, ఉపాధి కల్పన, ఇబ్బడి ముబ్బడిగా వస్తు వినియోగమే. అయితే, వీటి విపరిణామాల గురించి చాలా రోజుల వరకు పట్టించుకోలేదు. ఫలితంగా వాయు, జల, భూ కాలుష్యం విపరీతంగా పెరిగిపోయింది. నేలలో లవణాలు, హానికరమైన రసాయనాలు, భారలోహాలు పరిమితికి మించి పేరుకుపోతున్నాయి. దాంతో పంటల దిగుబడి తగ్గిపోతుంది. విష రసాయనాలు కలిసిన నీళ్లు, గడ్డి తినే పశువుల పాలూ, మాంసమూ కలుషితమై పోతాయి. చెరువుల్లో చేపలు మరణిస్తాయి. ఇక మనుషుల సంగతి చెప్పనక్కర్లేదు. చర్మ క్యాన్సర్లు, ఊపిరితిత్తుల సమస్యలు, కాలేయ క్యాన్సర్, మెదడులో కణుతులు.. ఇలా రకరకాల ఆరోగ్య సమస్యలు చుట్టుముడతాయి. వీటన్నిటి విపరిణామాలకు ఉదాహరణగా చెప్పుకోవాల్సిన ప్రాంతం పటాన్‌చెరు పారిశ్రామిక వాడ. ఇక్కడి వాగులు, చెరువులు సమీపంలోని పరిశ్రమల కాలుష్య భారాన్ని మోస్తుండటంతో ప్రజలు ఉద్యమించక తప్పలేదు. 1980, 1990లలో హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో వ్యాజ్యాలు దాఖలయ్యాయి. ఈ క్రమంలో సుప్రీం కోర్టులో దాఖలైన '1056/ 90' రిట్ పిటిషన్ ఎంతో ప్రసిద్ధి చెందింది. దీని పూర్వాపరాలను విశ్లేషిస్తూ సమయమంత్రి చంద్రశేఖర శర్మ వెలువరించిన పుస్తకం 'ఒక విధ్వంసం 1056/90'. పటాన్‌చెరు కాలుష్యం ప్రధానంగా సాగిన ఈ పుస్తకం మనకు పర్యావరణ పరిరక్షణ బాధ్యతను ఎంత అత్యవసరమో గుర్తుచేస్తుంది.

**ఒక విధ్వంసం**

**నివేదిక:** సమయమంత్రి చంద్రశేఖర శర్మ
**పేజీలు:** 398; **ధర:** 401
**ప్రచురణ:** శ్రీ జనచైతన్య పబ్లికేషన్స్
**ప్రతులకు:** **ఫోన్:** 76748 69432

## అర్థవంతమైన గమ్యాలకు పయనం




**మన(సు)** అనుభవాలకు అందమైన అక్షర రూపం ఇస్తే అది కవిత్వం అవుతుంది. ఈ ప్రయత్నంలో వాక్యాలను రాస్తాం. కొట్టేస్తాం. కొట్టివేసిన దాంట్లో రాసింది వెతుక్కుంటాం. కొత్తగా మళ్లీ ఏదో రాస్తుంటాం. మనసులో ఎంతో అలజడి జరిగితే గాని ఓ మంచి కవిత రూపుదాల్చదు. ఇలాంటి కవితల సమాహారమే కుడికాల వంశీధర్ 'లోపలి వాన' సంకలనం. 'గగనతలమంతా/ పొగ చూరినట్టుగా వుంది/ సందేహం లేదు!/ ఏ క్షణంలోనైనా/ వానపడొచ్చు..' అంటూ సాగే 'లోపలి వాన' కవిత వాన వైవిధ్యాన్ని కండ్లకు కడుతుంది. 'కాగితం పడవ'లో చిన్ననాటి జ్ఞాపకాలు వానలో తడవనివని గుర్తుచేస్తాడు. లాస్ ఏంజెల్స్‌లోని గోల్డెన్ గేట్ వంతెన వైభవాన్ని 'గోల్డెన్ గేట్ బ్రిడ్జ్' కవిత ఘనంగా చాటుతుంది. నగరీకరణ వేగం పుంజుకున్న సమయంలో ఉన్నాం. ఊళ్లను, పొలాలను రోడ్లు ముంచేస్తున్నాయి. ఈ పరిణామం పట్ల ఆవేదన వ్యక్తం చేస్తూ రాసిన 'ఔటర్ రింగ్ రోడ్' ఎంతో ఆలోచనాత్మకంగా సాగుతుంది. 'ఒకే దుఃఖం' కవిత కరోనా సమయంలో వలస కూలీల వెతలను దృశ్యమానం చేస్తుంది. 'లోపలి వాన' చదువుతుంటే పాఠకులకు తాము కూడా అర్థవంతమైన గమ్యాలకు వెళ్తున్నట్టుగా అనిపిస్తుంది.

**లోపలి వాన**

**రచన:** కుడికాల వంశీధర్
**పేజీలు:** 100; **ధర:** రూ. 150
**ప్రచురణ:** సాకేత్ & రాహుల్ ప్రచురణలు
**ప్రతులకు:** **ఫోన్:** 98852 01600

## ఘనం.. పీవీ వనం

### సువాసనల కల్యమాకు



**వంటకానికి** అన్ని దినుసులూ కలిసి రుచిని కల్పిస్తాయి. సువాసన అద్దేది మాత్రం కరివేపాకే. దీన్ని 'కల్యమాకు, కర్రీపత్తా, కర్రీ లీవ్' అని కూడా పిలుస్తారు. కరివేపాకు చెట్టు మధ్యస్తంగా పెరిగే మొక్క. గోరింట, దానిమ్మ చెట్లలాగే 10 నుంచి 12 అడుగుల ఎత్తు పెరుతుంది. మా స్నేహితురాలి ఇంటి దొడ్లో మామిడి చెట్టుతో పోటీ పడి ఎదిగిన కరివేపాకు చెట్టు ఒకటుంది. కరివేపాకు కొమ్మకు ఉండే రెమ్మలు తుంచిన కొద్దీ కొత్తవి పిలకలు వేస్తాయి. ఆకులు వేపాకును పోలి ఉన్నా అంచులు మాత్రం సాఫీగా ఉంటాయి. ఇది అధిక ఉష్ణోగ్రతను తట్టుకొని పెరుగుతుంది.

అనేక దేశాల్లో వంటకాల్లో సువాసన కోసం కరివేపాకును ఉపయోగిస్తారు. కరివేపాకు వేసిన పోపుతో కలిపిన పులిహోర తినని తెలుగువాళ్లు ఉండరు. సుగంధ భరితమైన ఆకును వంటల్లో ఉపయోగించినా, తినేముందు ఆకును తీసివేయడం ఎక్కువమందికి అలవాటు. దీని ఔషధ గుణాలు తెలిస్తే కరివేపాకుని తప్పకుండా తింటారు. కరివేపాకుని ఆయుర్వేదంలో ఔషధాల తయారీకి ఉపయోగిస్తారు. దీనిలో భాస్వరం, మెగ్నీషియం, ఇనుము వంటి ఖనిజ మూలకాలున్నాయి. విటమిన్ ఏ అధికంగా ఉండే కరివేపాకు తింటే కంటిచూపు మెరుగవుతుంది. రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. ఎముకలు దృఢంగా తయారవుతాయి. జుట్టు సమస్యలనూ పరిష్కరిస్తుంది.

కరివేపాకుని రైతులు వాణిజ్య పంటగా సాగు చేస్తున్నారు. దీని సాగుకు శ్రమ తక్కువ కాబట్టి ఎకరాల కొద్దీ సాగు చేస్తున్నారు. లాభాలు పండిస్తున్నారు. మా ఔషధవనంలో అర ఎకరాకుపైగా కరివేపాకు వనం సాగు చేస్తున్నాం. ప్రతి మూడు నెలలకు ఒకసారి మంచి దిగుబడినిస్తున్నది. చెట్టు కొమ్మలను నరికినా మళ్లీ మళ్లీ అంతకంటే రెండింతల కొమ్మలు చిగురిస్తున్నాయి. కరివేపాకు కాయలు కందిగింజ పరిమాణంలో గుత్తులు గుత్తులుగా కాస్తాయి. ఈ కాయలు ఎండిన తర్వాత విత్తుకోవచ్చు. మా ఇంటి ముందు పెద్ద రావి చెట్టు ఉంది. అది అనేక పక్షుల గూళ్లకు ఆలవాలం. వాటిలో పక్షులు తిని పడేసిన అనేక కరివేపాకు గింజలు వానకాలం వస్తే చాలు మా తోటంతా మొలకెత్తేవి.

**■ ఎమ్మెల్సీ సురభి వాణీదేవి, పీవీ కూతురు**

(...13వ పేజీ తరువాయి)

**అది ఎవరు?**

### సమాధానం

నిజానికి మాయాబావి అనేది ఏమీ లేదు. అలెక్స్ చంపేసిన రాజీ సహా అమ్మాయిల శవాలన్నిటినీ ఆ పాడుబడ్డ బావి నుంచి అలెక్స్ తల్లే బయటికి తీసి ఎవరికీ కనిపించకుండా సొరంగంలో కాల్చేసేది. అయితే, ఇదేమీ తెలియని అలెక్స్ శవాలను మాయాబావే మాయం చేస్తుందనుకొని మరింతగా రెచ్చిపోయాడు. ఎప్పుడైతే డిప్యూటీ కలెక్టర్ కూతురు రాజీని అలెక్స్ హత్య చేశాడో.. కొడుకు ఎక్కడ దొరికిపోతాడేమోనని అలెక్స్ తల్లి భయపడి అతణ్ని వారించింది. అయితే, కోపంలో తల్లినే చంపేసిన అలెక్స్ మాయాబావి ఆమె శవాన్ని మాయం చేస్తుందిలే అనుకొని అందులో పడేశాడు. అంతవరకూ అమ్మాయిల శవాలను మాయం చేయడంలో కీలకంగా మారిన అలెక్స్ తల్లే ఇప్పుడు శవంగా మారడంతో అలెక్స్ దొరికిపోయాడు. అందుకే రుద్ర.. 'మీ అమ్మను గనుక నువ్వు చంపకపోయుంటే, నువ్వు ఎప్పటికీ మాకు దొరికేవాడివి కాదు' అన్నాడు.